క్లుప్తంగా

స్టేజీ నిర్మాణానికి శంకుస్థాపన


స్టేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దుర్గారావు, క్రీడాకారులు

చింతూరు: స్థానిక సంతపాకల క్రికెట్ మైదానంలో స్టేజీ నిర్మాణానికి శనివారం దాత సింగంశెట్టి దుర్గారావు శంకుస్థాపన చేశారు. క్రికెట్ మైదానంలో స్టేజీ నిర్మాణానికి సహకరించాలని క్రీడాకారులు దుర్గారావును ఇటీవల కోరారు. దీంతో ఆయన స్పందించి స్టేజీ కోసం రూ 1.20 లక్షలు ఇస్తామని హామీనిచ్చారు. ఇందులో భాగంగా శనివారం ఆయన క్రీడాకారులతో కలసి స్టేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కో–ఆప్షన్ సభ్యుడు అక్బర్‌అలీ, జల్లి నరేష్, గణేష్, ప్రదీప్, రియాజ్, జీవన్, షహెన్‌షా, వీర్రాజు, ఆరీఫ్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మృతికి సంతాపం

పెదబయలు: మండలంలోని లక్ష్మీపేట పంచాయతీ మండిభ గ్రామానికి చెందిన కించేయి సన్యాసిదొర(41) పోలీసు కానిస్టెబుల్ ఉద్యోగం చేస్తు గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. శనివారం స్వగ్రామం మండిభలో పోలీసుల శాఖ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. విధులు నిర్వహిస్తు ఈ నెల 26న ప్రయాణంలో ఉండగా గుండెపోటుతో మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

శ్రమదానంతో ముళ్లపొదల తొలగింపు


పొదలను తొలగిస్తున్న యువకులు

ఎటపాక: మండలంలోని గన్నవరం నుంచి కృష్ణవరం గ్రామం వెళ్లే రహదారిలో ఉన్న ముళ్ల పొదలను శ్రమదానంతో యువకులు శనివారం తొలగించారు. రహదారికి అడ్డంగా పొదలు పెరగడంతో గూంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక యువకులు కార్యక్రమం చేపట్టారు. రామారావు, వీరేంద్ర, వెంకటేష్, రాంప్రసాద్, శ్రీను, సత్తెమ్మ తదితరులున్నారు.

సారా స్వాధీనం: ఇద్దరు అరెస్టు

రాజవొమ్మంగి: కిమ్మిలిగెడ్డ రక్షిత అటవీ ప్రాంతంలో సారా బట్టి నిర్వహిస్తు, వ్యాపారం చేస్తున్న కాకర జోగిరాజు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు రాజవొమ్మంగి ఎస్‌ఐ వెంకయ్య శనివారం తెలిపారు. అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని అతనిని అదుపులో తీసుకొని అడ్డతీగల ఏఎఫ్‌ఎం కోర్టులో హాజరుపరిచినట్టు చెప్పారు.

హుకుంపేట: దాలిగుమ్మడి గ్రామంలో సారా విక్రయిస్తున్నట్లుగా ముందస్తు సమాచారంతో శనివారం దాడులు నిర్వహించి, 41 లీటర్ల సారా కలిగి ఉన్న అర్లబు గోపీకృష్ణను అరెస్ట్ చేశామని, ఎస్‌ఐ సతీష్ తెలిపారు. అరెస్ట్ చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లుగా తెలిపారు.

రైతు బజారుల్లో గిరిజన రైతులకు స్టాళ్ల కేటాయింపు

మహారాణిపేట: నగరంలోని రైతుబజారుల్లో గిరిజన రైతుల ఎంపిక కోసం శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జేసీ కె.ఎస్.విశ్వనాథన్ డ్రా తీసి, స్టాళ్ల కేటాయించారు. రైతు బజారుల్లో స్టాళ్ల కోసం 2019 నుంచి 265 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పుడు 80 మందిని ఎంపిక చేశారు. ఎంపికైౖ గిరిజన రైతులు 10 రోజుల్లోగా ప్రస్తుతం వారికి ఉన్న భూమి, పంటల వివరాల ధ్రువపత్రాలను జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి కార్యాలయం(గోపాలపట్నం)లో సమర్పించి, గుర్తింపు కార్డులు పొందాలని జేసీ సూచించారు. పత్రాలు అందజేయలేని రైతులను అనర్హులుగా గుర్తించి.. వారి బదులు మిగిలిన రైతులకు స్టాళ్ల కేటాయిస్తామని స్పష్టం చేశారు.మరిన్ని వివరాలకు (99595 92474)ను సంప్రదించాలన్నారు.

పనుల్లో నిర్లక్ష్యంపై చర్యలు

ఎటపాక: సీతాపురం మండల పరిషత్ పాఠశాల వంట కార్మికురాలి పనుల్లో నిర్లక్ష్యంపై చర్యలు తీసుకుంటున్నట్టు పాఠశాల కమిటీ తీర్మానం మేరకు తొలగించినట్టు కమిటీ చైర్మన్ దుర్గ శనివారం తెలిపారు. విద్యార్థులకు భోజనం తయారీలో నాణ్యత పాటించకపోవడం, ఇంటి నుంచి భోజనం తీసుకురావడం వంటి పనులపె టీచర్లు, తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఎంఈవో విచారణతో తొలగించినట్టు పేర్కొన్నారు. రాజకీయ కక్షతో తొలగించినట్టు తప్పుడు ఆరోపణలు చేసి పత్రికల్లో ప్రకటించడం సరైంది కాదని చైర్మన్ దుర్గ అన్నారు.

సమరోత్సాహం

- సీఎం జగన్ సభకు భారీగా తరలి వెళ్లిన పార్టీ శ్రేణులు
- మేము సైతం సిద్ధం అంటూ కదంతొక్కిన కార్యకర్తలు
- జై జగన్ నినాదంతో మార్మోగిన రహదారులు


భీమిలిలోని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభకు బయలుదేరిన పాడేరు మండల నాయకులు


ముంచంగిపుట్టు నుంచి బస్సులో సీఎం జగన్ సభకు వెళ్తున్న పార్టీ శ్రేణులు


అరకు నుంచి భీమిలిలోని సీఎం జగన్ సభకు బయలుదేరిన పార్టీ శ్రేణులు


డుంబ్రిగుడ నుంచి సీఎం జగన్ సభకు తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు


అనంతగిరి నుంచి సీఎం సభకు వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు


చింతపల్లి నుంచి విశాఖలోని సీఎం జగన్ సభకు బయలుదేరిన ప్రజాప్రతినిధులు, నాయకులు

సాక్షి, పాడేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం విశాఖపట్నం భీమిలిలోని సంగివలసలో నిర్వహించిన సిద్ధం ఎన్నికల శంఖారావ సభకు అల్లూరి జిల్లా నుంచి నేతలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులంతా భారీగా తరలివెళ్లారు. ప్రత్యేక బస్సులతో పాటు కార్లు, మినీ వ్యాన్‌లలో కూడా ఉత్సాహంగా వెళ్లారు. దారులన్నీ భీమిలి వైపే సాగాయి. ఓ వైపు పొగమంచు తెరలు వీడక ముందే నేతలు, కార్యకర్తలంతా గ్రామాల నుంచి తమ ప్రియతమ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం కార్యక్రమానికి బయలుదేరారు.వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలంతా తమ నాయకులు, కార్యకర్తలతో సంగివలసకు చేరుకున్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి నేతలు తరలివెళ్లారు. జైజగన్ నినాదాలు హోరెత్తాయి.

అరకులోయటౌన్: భీమిలిలో నిర్వహించిన సీఎం జగన్మోహన్‌రెడ్డి సభకు అరకులోయ నియోజకవర్గ కేంద్రం నుంచి వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు లొక్కోయి లక్ష్మణకుమార్, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు ఎల్.బి.కిరణ్‌కుమార్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి గోపాలరావు, నాయకులు బాలరాజు, గురునాయుడు, సోమేష్ తదితరులున్నారు.

అనంతగిరి: భీమిలిలోని శనివారం జరిగిన సీఎం సభకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రేగబోయిన స్వామి ఆధ్వర్యంలోని మండలం నలుమూలల నుంచి రెండు ఆర్టీసీ బస్సులతో పాటుగా ప్రైవేట్ వాహనాల్లో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలు తరలివెళ్లారు. జై జగన్ అంటూ కాశీపట్నం వద్ద పెద్ద ఎత్తున గిరిజనులు నినాదాలు చేశారు.

దుంబ్రిగుడ: విశాఖ భీమిలిలో జరిగిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభకు మండలంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు రెండు బస్సుల్లో, కారుల్లో పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు , సర్పంచ్‌లు నాగేశ్వరరావు , వెంకటరావు, వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మొద్దు, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో 23 పంచాయతీల నుంచి శనివారం విశాఖలోని భీమిలిలో జరిగిన సీఎం జగన్ భారీ బహిరంగ సభకు భారీ స్థాయిలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, ఎంపీపీ సీతమ్మ జెండాను ఊపి తరువాత బస్సులు, వాహనాలు కదిలాయి. మండలం నుంచి సుమారు 200 మంది వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు సభకు తరలి వెళ్లారు.వారంతా జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ 175 సాధిద్దాం అంటూ సభకు బయలుదేరారు.

జి.మాడుగుల: విశాఖ భీమిలిలో జరిగిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిపి సుమారు 180 మందికి పైగాలు, అభిమానులు బస్సులు, కార్లలో తరలివెళ్లారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, ఎంపీటీసీలు గబ్బాడి సన్యాసిదొర, కూడా చిన్నారావు, లక్ష్మి, సర్పంచ్‌లు కిముడు రాంబాబు,సీదరి కొండబాబు, లసంగి మాలన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడు, జిల్లా పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పాంగి రామకృష్ణ, అంద్రయ్య, నాయకులు చినబాబు ఆచారి, చిట్టిబాబు,లక్ష్మణ్, పండన్న, దేముళ్లనాయుడు, చిన్నకొండబాబు, చంద్రపతి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భీమిలిలో నిర్వహించిన ఎన్నికల శంఖారావం భారీ బహిరంగా సభకు మండలంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.జై జగన్, జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేసుకుంటు సభకు బయలుదేరారు.


జి.మాడుగుల నుంచి సీఎం జగన్ సభకు తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

ఇంటింటికీ నూరుశాతం సంక్షేమం


కిమ్మూరులో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

గడప గడపకు గ్రామాల్లో విశేష స్పందన

అడ్డతీగల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలతో ఇంటింటికీ వంద శాతం సంక్షేమం దక్కిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు.అడ్డతీగల మండలం పులిగోగుల పాడు పంచాయితీలోని కొత్తూరుపాడు, మాలయ్యపాకలు, పులిగోగులపాడు గ్రామాలతో పాటు కిమ్మూరు, గొంటువానిపాలెం గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.

వారు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి ,సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ గతంలో ఏ పాలకులు చేయని విధంగా అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను కులాలు, మతాలకు అతీతంగా పార్టీలతో నిమిత్తం లేకుండా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు.విద్యారంగంలో ఇంగ్లిషు మీడియం అందుబాటులోనికి తీసుకొచ్చి కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా మౌలిక సౌకర్యాలు కల్పించి డిజిటల్ విద్యను అమలు చేస్తున్నారన్నారు. పల్లె పల్లెలో వైద్య సేవలు అందేలా సిబ్బందిని పెంచి అత్యాధునిక వైద్యం సైతం పేదవాడికి దక్కేలా చూస్తున్నారన్నారు. ప్రతి నెల ఒకటో తేది నాటికి పింఛన్‌లు అందిస్తున్నారన్నారు. అలాగే మహిళల ఆర్థికాభివృద్ధి సాధనకు బాటలు వేయడానికి వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి వాటితో పాటు అనేక పథకాలను అమల్లోకి తీసుకొచ్చారన్నారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి, పేదల అభ్యున్నతి కోసం శ్రమించే జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో గెలిపించిన మరలా ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. సుపరిపాలన అందిస్తున్న జగనన్నకు అందరూ మద్దతుగా నిలవాలన్నారు. మాలయ్యపాకలులో పలువురు వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు.అలాగే పలు గ్రామాల్లో యువతకు క్రీడా పరికరాలను అందజేశారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, వైస్ ఎంపీపీ బాలసుబ్రహ్మణ్యం, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు


కబడ్డీ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన జీకే వీధి జట్టు సభ్యులతో నిర్వాహకులు


వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

పాడేరు : నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఉత్సాహంగా జరుగుతున్నాయి. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించి మండలస్థాయిలో ప్రతిభ కనబరిచిన జట్లు నియోజకవర్గ స్థాయిలో తలపడుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం మహిళల విభాగంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కబడ్డీ ఫైనల్స్‌లో చింతపల్లి జట్టుపై జీకే వీధి జట్టు విజయం సాధించి ప్రథమస్థానం, కొయ్యూరు జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. వాలీబాల్ ఫైనల్‌లో జి.మాడుగుల జట్టుపై కొయ్యూరు జట్టు విజయం సాధించింది. పోటీలను పోటీలను క్రీడల జిల్లా పరిశీలకుడు శివరామ్‌కుమార్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఎ.జగన్‌మోహన్‌రావు, జిల్లా స్పోర్ట్స్ కార్యదర్శి పి. సూరిబాబు పర్యవేక్షించారు. ఈనెల 31 నుంచి జిల్లా స్థాయి పోటీలను నిర్వహిస్తామని డీఎస్‌డీవో జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ సత్యవతి, మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ ప్రభాకర్‌రావు, డీఎల్‌డీవో శాంతలక్ష్మి, ఎంపీడీవో సాయినవీన్, సచివాలయ కార్యదర్శి దివాకర్, పీడీలు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ల అభ్యున్నతికి కృషి

రంపచోడవరం: రంపచోడవరం మండలంలోని శ్రీ విజయ సాయి దుర్గ ప్రైవేట్ ఎలక్ట్రిషియన్స్, ప్లంబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎలక్ట్రిషియన్స్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పీఎంఆర్‌సీ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు సభ్యులందరూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభాస్థలికి చేరుకొని మండలంలోని ఎలక్ట్రిషియన్ల అందరూ కలిసి యూనియన్ అభివృద్ధి కోసం ఈ ఏడాది చేయవలసిన కార్యాచరణ రూపొందించుకున్నారు. పలువురు మాట్లాడుతూ ఎలక్ట్రిసియన్ల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరెంట్ ఆఫీస్ సిబ్బందిని హాజరయ్యి పలు సూచనలు తెలియజేశారు.యూనియన్ అధ్యక్షుడు పోసిబాబు, కోశాధికారి రమేష్, ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్లు

జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటింటికీ వైద్య సేవలు


సీకరిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



వాతంగిలోని శిబిరంలో రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెదబయలు: మండలంలోని సీకరి గ్రామ సచివాలయం పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల ఆవరణలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పాడేరు చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ స్నేహిత రెడ్డి మాట్లాడుతూ శిబిరంలో 220 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశామన్నారు. శిబిరంలో వివిధ శస్త్ర చికిత్సల నిమిత్తం అవసరమైన 14 మందిని పాడేరు జిల్లా ఆస్పత్రి, విశాఖ కేజీహెచ్‌లకు సిఫార్సు చేసినట్టు చెప్పారు. వైద్య నిపుణులు డాక్టర్ గీతాంజలి, జి.నిఖిల్, సత్యశ్రీ వైద్య సిబ్బంది వెంకటరావు, సింహాచలం, కృష్ణకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: వాతంగి సచివాలయం వద్ద సర్పంచ్ భీంరెడ్డి సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ రాజేశ్వరి జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. 124 మంది రోగులకు వైద్య నిపుణులు డాక్టర్ జీవన్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ యామిని ప్రియ ఉచిత వైద్య సేవలు అందజేసినట్టు హెల్త్ కో–ఆర్డినేటర్ సుధాకర్ తెలిపారు. . కంటి వైద్య శిబిరం నిర్వహించారు. హెచ్.వి.వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్లు శామ్యూల్, పద్దరాజు, ఏఎన్‌ఎం కుమారి, ఆశ, 104 సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని ఓగిపాలెంలో 35 మందికి రక్తపరీక్షలు చేసినట్టు డాక్టర్ జీవన్ తెలిపారు. 104 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

ముంచంగిపుట్టు: మండలంలో పనిచేస్తున్న గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులు శనివారం ఎంపీడీవో కిరణ్‌కుమార్, వెలుగు ఏపీఎం దేవమంగకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల పేస్కేల్ అమలు చేసి సర్వీసు రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ మేరకు జేఏసీ పిలుపుమేరకు శనివారం నుంచి విధులు బహిష్కరించి, సమ్మెబాట పడుతున్నట్టు సెర్ప్ ఉద్యోగులు జగదాంబ, నాగరాజు, బాబూరావు, భవానీలు తెలిపారు.

ఎంపీడీవోకు బదిలీ

చింతపల్లిరూరల్: చింతపల్లి ఎంపీడీవో పి.ఆశాజ్యోతిని తూర్పుగోదావరి బదిలీ చేస్తూ పంచాయతీ రాజ్ కమిషనర్ సూర్యకుమారి(ఐఏఎస్) ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో ఎనిమిది నెలలుగా ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన ఆమెను తూర్పుగోదావరికి బదిలీ చేశారు. విశాఖ జెడ్పీ సీఈవోను కలిసిన తరువాత విధుల నిర్వహణ ఉత్తర్వులు పొందనున్నట్టు తెలిపారు.

విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం


విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు


పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

గంగవరం : పేద పిల్లలు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, వైస్ ఎంపీపీ -2 కె.గంగాదేవి అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ఆవరణలో మండల విద్యాశాఖాధికారి టి.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, పదో తరగతి విద్యార్థులకు విద్యా భారతి స్టడీమెటీరియల్‌ను ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్‌ఎంపీపీ గంగాదేవి, సర్పంచ్ కలుముల అక్కమ్మ, ఉపసర్పంచ్ పరదా వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలలు ఎంతో అభివృద్ధిని సాధించాయని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. ఎంఈవో-2 మల్లేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలలకు చెందిన 320 మంది పదో తరగతి బాల బాలికలకు విద్యాభారతి స్టడీ మెటీరియల్, 270 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేసినట్టు చెప్పారు. వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన హెచ్ఎంలు ఝాన్సీహేన్సన్, బి.నాగేశ్వరరావు, ఆర్.వి.వి. సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొనగా సీనియర్ ఉపాధ్యాయులు పి.ఉమాదేవి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

పర్యాటక ప్రాంతాలు కళకళ


తాటిగూడ జలపాతం వద్ద పర్యాటకులు


కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకుల సందడి


చాపరాయి వద్ద పర్యాటకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన తాటిగూడ జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. సందర్శకులు పెద్ద ఎత్తున తరలిరావడంతో జలపాతం వద్ద సందడి నెలకొంది. వ్యూపాయింట్ నుంచి జలపాతం అందాలను తిలకించారు. బొర్రాగుహలకు పర్యాటకులు పోటెత్తారు. జిప్‌లైన్ ద్వారా విహరించి గోస్తనీ లోయ అందాలను వీక్షించారు.

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం పర్యాటకుల రాకతో కళకళలాడింది. తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. జలపాతాలు, వ్యూ పాయింట్ వద్ద సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని సందడి చేశారు. చీకులు, బొంగు చికెన్ అమ్మకాలు భారీగా జరిగాయి.

దుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతానికి శనివారం మైదాన ప్రాంతం నుంచి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు.

అంబరాన్నంటిన సంబరం

- ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


అమ్మవారి రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర విజిలెన్స్ కార్యదర్శి రాజశేఖర్


ప్రదర్శనలో ఆంజనేయ వేషధారి

అనకాపల్లి: గవరపాలెంలో గౌరీపరమేశ్వరుల మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం తెల్లవారుజాము నుంచి ఇక్కడ ప్రారంభమైన ఉత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన నేల వేషాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్టేజ్ ప్రోగ్రాలు ఉత్సాహం పంచాయి. ఈ సందర్భంగా స్వామిఅమ్మవార్లను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు వారిని శాలువాలతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాన్ని నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

తొలుత అమ్మవారి ఉత్సవ రథాన్ని కేంద్ర విజిలెన్స్ కార్యదర్శి వై.వి.వి.జె.రాజశేఖర్ ప్రారంభించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొణతాల సంతోష్‌అప్పారావు నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనువాసరావు, కోశాధికారి కొణతాల నూకమహాలక్ష్మీనాయుడు, నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, కనకదుర్గ అమ్మవారి దేవస్థానం వ్యవస్థాపకుడు పీవీ రమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.